సాక్షి తిరుపతి

సోమవారం ׀ 4 ׀ డిసెంబర్ ׀ 2023



తిరుమలలో సినీహీరో నాని

సినీ హీరో నాని ఆదివారం అలిపిరి నుంచి కాలినడక మార్గంలో తిరుమలకు చేరుకున్నారు. - 10లో



హృదయం.. పదిలం

ఆధునిక జీవన విధానంలో పెరుగుతున్న హార్ట్‌రోగుల చికిత్సకు ప్రభుత్వం స్కీమ్ కార్యక్రమం చేపట్టింది. - 10లో



మంత్రుల నివాళి

మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి చిత్రపటానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి నివాళులర్పించారు. - 10లో

న్యూస్‌రీల్

సురక్షిత ప్రాంతాలకు తరలించండి



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో లోతట్టు వాసులను వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసి అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని స్పష్టం చేశారు. పెనుగాలులు వీచే ప్రమాదమున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాత భవనాల్లో నివసించేవారిని వెంటనే పునరావాసకేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా 4, 5 తేదీలలో పిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఇంటి నుంచి బయటకు రావద్దని కోరారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి మండల కేంద్రంలో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆపదలో ఉన్నవారిని సకాలంలో ఆదుకోవాలని స్పష్టం చేశారు.

పకడ్బందీగా 'పునరావాసం'



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తుపాను నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజల రక్షణకు పునరావాసకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరికైనా సమస్య వస్తే వెంటనే కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వలంటీర్ ద్వారా కమిషనర్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. అధికారులు సకాలంలో ప్రజలకు సహాయక చర్యలు అందించాలని స్పష్టం చేశారు. సమస్యలపై 0877-2236007, 9347755466 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

నేటి 'స్పందన' రద్దు

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తుపాను కారణంగా రద్దు చేసినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుసున్న నేపథ్యంలో అర్జీదారులు ఇబ్బంది పడే అవకాశముందని స్పందన రద్దు చేసినట్లు వెల్లడించారు.

శాస్త్రోక్తంగా బాలాలయ ఉత్సవం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నాగలాపురం : శ్రీదేవి భూదేవి సమేత వేదనారాయణస్వామి ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా బాలాలయ ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఆదివారం రెండో రోజు శాస్త్రోక్తంగా హోమం, రక్షాబంధనం, వైదిక కార్యక్రమాలు జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, షరాబు ఉదయ కుమార్, జూనియర్ అధికారి జానకిరామ్ పాల్గొన్నారు.



సత్యవేడు : రోడ్డుపై ఉప్పొంగుతున్న గొర్రెరు



ఏర్పేడు మండలం ఇసుకతాగేలి వద్ద పొలాల్లో వరద ఉధృతి

జిల్లా వ్యాప్తంగా కంట్రోల్ రూమ్‌లు

కలెక్టరేట్ హెల్ప్‌డెస్క్	: 0877-2236007
తిరుపతి	: 9491077012
శ్రీకాళహస్తి	: 9704161120
సూళ్లూరుపేట	: 9490739223
గూడూరు	: 08624-252807

అలజడి

జిల్లావ్యాప్తంగా మిచాంగ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తీర ప్రాంతాలను ఈదురు గాలులు వణికిస్తున్నాయి. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఉప్పొంగుతున్నాయి. డ్యామ్‌లు.. రిజర్వాయర్లు.. చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. వాగులు.. వంకలు.. నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు చోట్ల రహదారులపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

- తుపాను ప్రభావంతో భారీ వర్షాలు
- తీర ప్రాంతాల్లో ఈదురుగాలులు
- ఉప్పొంగుతున్న చెరువులు, నదులు
- రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల చేస్తున్న అధికారులు
- నేడు విద్యాసంస్థలకు సెలవు
- జిల్లా వ్యాప్తంగా కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌డెస్క్‌లు

తిరుపతి అర్బన్/కేవీబీపురం/సూళ్లూరుపేట/నాయుడుపేట టౌన్/నారాయణవనం/వాకాడు/పిచ్చాటూరు/రేణిగుంట/తిరుపతి సిటీ : మిచాంగ్ తుపాను మంగళవారం తీరం దాటే అవకాశముండడంతో జిల్లావ్యాప్తంగా పెను గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు, చెరువులు, డ్యామ్‌లు, రిజర్వాయర్లు పొంగి పొర్లుతున్నాయి.ఆదివారం శ్రీకాళహస్తిలో అత్యధికంగా 155.3మి.మీ, అత్యల్పంగా సత్యవేడులో 2.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం పాఠశాలలకు, కళాశాలలకు సెలవు ప్రకటించారు.

అధికారులు అప్రమత్తం

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్వర్ణముఖీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పరీవాహక ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. చంద్రగిరి నియోజవర్గం తిరుపతి రూరల్ పరిధిలోని యోగిమల్లవరం, తనపల్లి, కుంట్రపాకం ప్రాంతాలలో స్వర్ణముఖి నదీ ప్రవాహన్ని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి పరిశీలించారు. తిరుపతి నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలంలోని తోపుగుంటపాళెం వద్ద ఉప్పొంగుతున్న ఉప్పుటేరును జేసీ బాలాజీ పరిశీలించారు. కోట మండలం తీరప్రాంతంలోని కొత్త పట్నం వాసులను అప్రమత్తం చేశారు. వాకాడు మండలం తూపిలిపాళెంలో మత్స్యకారులను వేటకు వెళ్లరాదంటూ ఆదేశించారు. పునరావస కేంద్రాల్లోని వారికి ఆహారం, తాగునీరు, నిత్యావసర సరుకులు అందించారు. తీర ప్రాంత గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీ చేశారు. వెంకటగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోతకు గురైన పాళెంకోట వంతెనను పరిశీలించారు. పిచ్చాటూరు- శ్రీకాళహస్తి మార్గంలో కోవనూరు వద్ద రాళ్లవాగు ఉప్పొంగడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పిచ్చాటూరు మండలంలో గొడ్డేటి వాగు వద్ద గట్టి బందోబస్తు పెట్టారు. నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదీ ప్రవాహాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. మామిడి కాలువ పొంగిపొర్లుతుండడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల

కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ దాదాపు నిండిపోయింది 6,120 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండటంతో అరు మినీ గేట్లు, రెండు ప్రధాన గేట్ల నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టులో నీటి మట్టం 26 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం గంటకు 2 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోందని, సోమవారం ఉదయం 9.30 గంటలకు ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్ వెల్లడించారు. రేణిగుంట మండలంలోని మల్లెమడుగు రిజర్వాయర్ శనివారం రాత్రి నిండిపోవడంతో ఆదివారం 11 గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు. కల్యాణి డ్యామ్ ఆదివారం రాత్రికి పూర్తి స్థాయిలో నిండుతుందని అంచనా వేస్తున్నారు. వాకాడు వైఎస్సార్ స్వర్ణముఖి బ్యారేజ్ నుంచి 4వేల క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు.

ఉధృతంగా జలపాతాలు

నారాయణవనం మండలంలోని కైలాసనాథకోన, సింగిరి కోనలోని జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అరణ్యకండ్రిగ పంచాయతీలోని తుంబూరు తీర్థ కోన జలపాతం కనువిందు చేస్తోంది.

తిరుమలలో ఎడతెరిపిలేని వర్షం

తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

నిండిన పులికాట్ సరస్సు

భారీ వర్షాలకు పులికాట్ సరస్సుకు వరద పోటెత్తుతోంది. నదులతోపాటు సముద్ర ముఖద్వారం నుంచి భారీగా నీరు చేరడంతో నిండుగా మారింది.

విద్యుత్‌శాఖ కంట్రోల్ కేంద్రం

నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి సబ్ డివిజన్ పరిధి విద్యుత్ సమస్యలు తలెత్తితే 7382623178 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్పీడీసీఎల్ ఈఈ ప్రసన్నకుమార్ కోరారు.



ఏర్పేడు మండలం పాతవీరాపురంలో నీట మునిగిన పంట పొలాలు



అంజిమేడు వద్ద బందమానివాగు నీటి ప్రవాహం



గొడ్డేటి వాగు వద్ద పోలీసు కాపలా



ఉధృతంగా ప్రవహిస్తున్న కైవల్యానది



కాళంగి రిజర్వాయర్ నుంచి బయటకు వదిలిన నీరు



మల్లెమడుగు రిజర్వాయర్ నుంచి నీటి విడుదల



పులికాట్‌కు జలకళ



కాళంగి వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు



తీరప్రాంత గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు

ఉసురు తీసిన ముసురు



యశ్వంత్ మృతదేహం

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి ఎస్టీ కాలనీలో ఆదివారం పూరి గుడిసె కూలడంతో ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు.. శ్రీను, కావేరి దంపతులకు ముగ్గురు పిల్లలు. భారీ వర్షాలు కురుస్తుండడంతో వీఆర్‌ఓ రమణ గ్రామానికి వెళ్లి స్థానికులను పంచాయతీ కార్యాలయంలో తలదాచుకోవాలని సూచించారు. కాలనీ వాసులు స్పందించలేదు. ఈ క్రమంలో శ్రీను కుటుంబం నివసిస్తున్న గుడిసె వర్షం తాకిడికి కూలింది. వారి రెండో కుమారుడు యశ్వంత్ (4)పై మట్టి గోడ పడి మృత్యువాత పడ్డాడు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి వెంటనే గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.




పాళెంకోట వద్ద కోతకు గురైన వంతెనను పరిశీలిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి



లోతట్టు ప్రాంతాల పరిశీలనలో తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత



యోగిమల్లవరంలో పర్యటిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



కలుజు పారుతున్న బంగారుపేట చెరువు

వేడుకగా కార్తీక వనమహోత్సవం



ఇష్టపది పుస్తకావిష్కరణలో అతిథులు

తిరుపతి కల్చరల్: తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో త్యాగరాజ మండపంలో ఆదివారం వేడుకగా కార్తీక వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ అభిషేకం, ఉసిరి చెట్టు, తులసి చెట్టు పూజను శాస్త్రోక్తంగా చేపట్టారు.కార్తీక పురాణ పఠనం చేశారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం కులపతి సీతారామ కృష్ణమూర్తి శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులు సమాజ సేవలో పాల్గొని జనం హితం కోరాలని పిలుపు నిచ్చారు. వేద వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ ప్రాచీన వేద శాస్త్రాలను వైజ్ఞానిక దృష్టితో అభివృద్ధి చేయాలని కోరారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ బ్రాహ్మణులు సంకల్ప సిద్ధి, నియమ నిష్టలు, వైదిక విజ్ఞానం మేరకు ప్రవర్తించాలని సూచించారు. టీటీడీ ఆడిట్ అధికారి కె.శేషశైలేంద్ర మాట్లాడుతూ వేదజ్ఞానాన్ని దేశ హితం కోసం ఉపయోగించాలన్నారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ సంధ్యావందనాలు పూజా పునస్కారాలను సకాలంలో నిర్వర్తించాలని కోరారు. తిరుపతి బ్రాహ్మణ సమాజం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీమాస్ బాలాజీ, కొత్తపల్లి అజయ్ కుమార్ మాట్లాడుతూ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఐతరాజు స్రవంతి రచించిన ఇష్టపది పుస్తకాన్ని ఆవిష్కరించారు. బ్రాహ్మణ సమాజం నేతలు సింగరాజు ప్రభాకర్, డాక్టర్ చక్రవర్తి రాఘవన్, వెంకట్ పెరిమాళ్, వేదం హరిప్రసాద్, ఓవీ రామశర్మ, కిషన్, శ్రీనివాస్, గోకుల తిరుచానూరు బాబుస్వామి, సనత్ కుమార్, కృష్ణశేషు, పట్టాభిరామారావు, సంధ్యారాణి, వాణి, విజయలక్ష్మి, హేమలత పాల్గొన్నారు.

స్వర్ణమ్మ పరవళ్లు

- హారతికి సిద్ధంగా ఉత్తర వాహిని
- ఐదేళ్ల నుంచి ఏటా నదిలో నీటి ప్రవాహం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఉత్తరవాహినిగా ప్రసిద్ధి చెందిన స్వర్ణముఖీ నది గత ఐదేళ్లలో క్రమం తప్పకుండా ఏటా పరవళ్ల తొక్కుతూ ప్రవహిస్తోంది. తిరుపతి రూరల్ మండలం తొండవాడలో పుట్టి కొండల నడుమ ముందుకు సాగే ఈ పవిత్ర నదిలో పుణ్యస్నానమాచరించేందుకు భక్తులు తరలివస్తుంటారు. శ్రీనివాసమంగాపురం, అగస్తీశ్వరాలయం, యోగిమల్లవరంలోని పరశురామేశ్వరాలయం, గుడిమల్లంలోని పరశురామేశ్వరుని ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయం, ఈశ్వరాపురం అర్ధనారీశ్వరాలయాలను స్పృశిస్తూ నాయుడుపేట, కోట మీదుగా స్వర్ణముఖి సముద్రంలో కలుస్తోంది. ఒకప్పుడు ఈ నదిలో నీటి ప్రవాహం కాకుండా మురుగు నీరు నిల్వ చేరి ఉండేది. గతంలో శ్రీకృష్ణదేవరాయులవారు ముక్కంటిని సేవించుకుని స్వర్ణముఖి నదికి హారతి సమర్పించారని చరిత్రలో పేర్కొని ఉంది. పురాతన సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐదేళ్లుగా స్వర్ణముఖీ నదికి వైభవోపేతంగా హారతి సమర్పిస్తున్నారు. అప్పటి నుంచి హారతి అందుకునేందుకు ఏటా కార్తీక మాసంలో స్వర్ణమ్మ పరవళ్లు తొక్కడం భక్తులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తోంది. ఈ ఏడాది నవంబర్ పూర్తయినా నదిలో నీరు లేకపోవడంతో కొందరు అవహేళనగా మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. ఈక్రమంలో భారీ వర్షాలకు స్వర్ణముఖి ఉప్పొంగుతుండడంతో పట్టణప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీన కనులపండువగా నదీమతల్లికి హారతి సమర్పించేందుకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆలయ అధికారులు సన్నద్ధమవుతున్నారు.



నిండుగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి



హారతిసమర్పించే వేదిక

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 66,162 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 27,668 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.24 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఆగమోక్తంగా ఆకాశదీపం


కార్తీక దీపానికి పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆగమోక్తంగా ఆకాశదీపం వెలిగించారు. ముందుగా ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.

శ్రీకాళహస్తిలో 155.3 మి.మీ వర్షం


ఈఈ మదన్‌గోపాల్

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పరిధిలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకు 155.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఇరిగేషన్ ఈఈ మదన్‌గోపాల్ తెలిపారు. స్వర్ణముఖి నది నుంచి 5,700 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్లినట్లు వెల్లడించారు. చెరువులు నిండుగా ఉండడంతో చెంబేడు కాలువ మూసివేశామన్నారు. భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

హృదయం.. పదిలం


స్పోక్స్ సెంటర్లలో చికిత్స అందిస్తున్న సిబ్బంది

■ గత అక్టోబర్ 16వ తేదీన కర్ణాటకకు చెందిన కుమార్‌గౌడ్ (51)కు తిరుమలకు శ్రీవారి దర్శనం కోసం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో అతడికి తీవ్ర గుండె నొప్పి వచ్చింది. కుటుంబ సభ్యులంతా తల్లడిల్లిపోయారు. దీంతో వెంటనే అతడిని చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. స్పోక్స్ సెంటర్‌లోని సిబ్బంది బాధితుడికి ఈసీజీ తీసి, నిమిషాల వ్యవధిలోనే కార్డియాలజిస్ట్ సూచనల మేరకు థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ చేసి, ప్రాణాలు కాపాడారు.

మనిషి గుండె పిడికెడు. అదే ప్రాణానికి మూలం. అలుపూ సొలుపూ లేకుండా శక్తివంతంగా పనిచేసే సజీవ యంత్రం. అయితే ఆధునిక జీవనం.. ఆహారపు అలవాట్లుతో హృదయం గతి తప్పుతోంది. చెట్టంత మనిషిని నిలువునా కుంగదీస్తోంది. ఈ విషయం గుర్తించిన ప్రభుత్వం స్టెమీ కార్యక్రమం అమలుతో పేదల చిన్ని గుండెకు రక్షణ కల్పిస్తోంది. దీనిపై ప్రత్యేక కథనం.

- గుండెదడకు ప్రభుత్వ చికిత్స
- స్టెమీ కార్యక్రమానికి శ్రీకారం
- జిల్లావ్యాప్తంగా 24 స్పోక్స్ సెంటర్ల ఏర్పాటు
- తక్షణమే ఇంజెక్షన్‌తో బాధితులకు భరోసా

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలకు అత్యంతప్రాధాన్యత ఇస్తోంది. అందులోను పేదలకు ఖరీదైనా వైద్యాన్ని పల్లె ముగింటకే తీసుకొస్తోంది. ప్రధానంగా గుండె దడకు బ్రేకులు వేస్తోంది. పేదలకు ఊపిరికి ఊతమిస్తోంది. స్టెమీ(ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్)అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్పోక్స్ సెంటర్లను ప్రారంభించి గుండె నొప్పి నుంచి బయటపడేలా చేస్తోంది.

12 వేల మంది హృద్రోగులు

ఉమ్మడి జిల్లాలో సుమారు 46 లక్షల మంది జనాభా ఉన్నారు. గత ఏడాది ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు ఎన్‌సీడీ సర్వేలో భాగంగా 42 లక్షల మందిని పరీక్షించారు. అందులో 12,02,431 మంది మధుమేహం, 1,96,772 మంది రక్తపోటుతో బాధ పడుతున్నట్లు తేలింది. బీపీ, షుగర్ రెండూ ఉన్న వారు సుమారు 80 వేల మంది వరకు ఉన్నారు. అలాగే 12 వేల మంది గుండె సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. మనిషి ఆహార నియమాలు పాటించకపోవడంతో గుండెకు చిల్లులు పడేలా చేస్తోంది. బీపీ, మధుమేహం, ఊబకాయం వంటి రోగాలు గుండె దడపుట్టిస్తున్నాయి. మానసిక వ్యాధి కూడా మనిషికి గుండె నొప్పిని తెచ్చిపెడుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల చాలా మంది ఛాతీలో కాస్తంత నొప్పి రాగానే ఆస్పత్రికి వెళుతున్నారు. తీరా వెళ్లాక నిజంగానే హార్ట్‌స్ట్రోక్ వచ్చిందంటూ ఎమర్జన్సీగా స్టంట్ వేయడమో? లేదంటే శస్త్రచికిత్స చేయాల్సి రావడమో జరుగుతోంది. దీనికి భిన్నంగా కనిపించే కేసులు కూడా ఉంటున్నాయి. గుండె జబ్బు బారిన పడి నిమిషాలు, గంటల వ్యవధిలో చనిపోయే వారి సంఖ్య జిల్లాలో పెరుగుతూ వస్తోంది. కరోనా తర్వాత ఈ కేసులు సంఖ్య మరింత పెరిగింది. ఆస్పత్రికి వెళ్లే లోపు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి కేసులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏటా పదుల సంఖ్యలో నమోదవుతున్నాయి. అలాగే నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) సర్వే కేసులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. గుండె జబ్బుల నివారణకు చర్యలు చేపట్టింది. స్టెమీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది.

రోగులకు స్టెమీతో భరోసా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు 5,838 మందికి ఈసీజీ తీశారు. వారిలో 148 మందికి గుండె సంబంధిత సమస్యలున్నట్లు గుర్తించారు. ఇందులో 25 మందికి థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ ఇవ్వగా, 96 మందిని తిరుపతిలోని హబ్‌కు రెఫర్ చేశారు. తద్వారా గుండెనొప్పితో బాధ పడుతున్న వారికి స్టెమీ భరోసా కల్పిస్తోంది.

స్టెమీ కార్యక్రమం ఇలా...

స్టెమీ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏపీవీపీలో పరిధిలో ఉన్న ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో 24 స్పోక్స్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లకు 12 లీడ్స్ ఉండే ఈసీజీ మిషన్ అందజేశారు. అలాగే కంప్యూటర్ అందజేసి స్టెమీ సాఫ్ట్‌వేర్‌ను అందులో అప్‌లోడ్ చేయించారు. ఐసీయూ బెడ్, ఐవీ స్టాండ్, మల్టీ పారా మానిటర్, 26 రకాల అత్యవసర డ్రగ్స్‌ను అందుబాటులో ఉంచారు. అత్యవసర విభాగంలో పనిచేసే డాక్టర్లు, సిబ్బందితోపాటు ప్రత్యేకంగా ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, స్టాఫ్‌నర్సును కేటాయించారు. గుండె నొప్పితో స్పోక్స్ సెంటర్‌కు వచ్చిన వారికి తక్షణమే ఈసీజీ తీస్తారు. దీన్ని ఇంటర్‌నెట్‌కు కనెక్ట్ చేస్తారు. ఆ రిపోర్ట్‌ను స్టెమీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇలా చేసిన వెంటనే రెండు నిమిషాల్లో ఆ రిపోర్ట్ వివరాలు రుయాలోని హబ్‌కు చేరుతాయి. అక్కడున్న గుండె వైద్య నిపుణులు రిపోర్ట్ చూసి, ఎలాంటి చికిత్స చేయాలో ఆయాప్‌లోనే నమోదు చేస్తారు. దీని ఆధారంగా స్పోక్స్ సెంటర్‌లో సిబ్బంది రోగికి చికిత్స అందిస్తారు. అత్యవసరమైన వ్యక్తికి సెంటర్‌లో నే థ్రాంబోలైసిస్ ఇంజెక్షన్ ఇస్తారు. తరువాత హ బ్‌కు రెఫర్ చేస్తారు. ఈ ఇంజెక్షన్ ధర మా ర్కెట్‌లో రూ. 30 వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి ఇంజెక్షన్‌లు జిల్లా ఆస్పత్రుల్లో 5, ఏరియా ఆస్పత్రుల్లో 3, సీహెచ్‌సీలో 2 వంతున అందుబాటులో ఉంచా మని అధికారులు చెబుతున్నారు. గోల్డెన్ అవర్‌లో స్టెమీ చికిత్స అందేలా చూస్తోంది. రోగులకు ప్రాణం పోస్తోంది.

స్పోక్స్ సెంటర్లతో గుండె పదిలం



కరోనా తర్వాత గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం గుండె జబ్బు నివారణకు చర్యలు తీసుకుంది. స్టెమీ కార్యక్రమం ద్వారా గుండె జబ్బుకు చికిత్స అందిస్తోంది. పల్లె ప్రాంతాల్లోని ఏరియా, సీహెచ్‌సీల్లో కూడా స్టెమీతో స్పోక్స్ సెంటర్లను ఏర్పాటు చేశాం. దీనిపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని తరచూ ఆదేశాలిస్తున్నాం. స్టెమీ అంటే గుండె రక్తనాళం. వంద శాతం పూడి పోవడంతో వచ్చే గుండెపోటు. దీనికి గురైన బాధితుడికి వీలైనంత త్వరగా పూడికను కరిగించే చికిత్స ఇది.

-రాజశేఖర్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్, చిత్తూరు

ఊపిరి పోస్తోంది



జీవనశైలిలోని మార్పుల కారణంగా హార్ట్‌స్ట్రోక్ సర్వసాధారణంగా మారింది. ఎక్కువగా మగవాళ్లు గుండె జబ్బులతో చనిపోతున్నారు. శారీరక, ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, మానసిక రుగ్మతాలు తదితర కారణాలతో గుండెపై భారం పడుతోంది. ఈ ప్రభావంతో మనిషి క్షణాల్లో మృతి చెందుతున్నాడు. ఇలాంటి వ్యాధుల నివారణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం స్టెమీ కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. వేలాది రూపాయలు విలువ చేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా అందించి, బాధితులు ఊపిరి పోస్తోంది. స్ట్రోక్ వచ్చినప్పుడు వెంటనే స్పోక్స్ సెంటర్‌కు తరలించాలి.

-శ్రీహరి, తిరుపతి డీఎంహెచ్‌ఓ, తిరుపతి

శ్రీవారి సేవలో ప్రముఖులు


శ్రీవారి ఆలయం వెలుపల ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, సినీ నటుడు వేణు, డైరెక్టర్ సురేందర్ రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.అరవింద్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, సినీ నటుడు వేణు, సినీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి సేవించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

తిరుమలలో సినీ హీరో నాని


తిరుమలలో నాని

శ్రీవారి దర్శనార్థం ఆదివారం రాత్రి అలిపిరి కాలినడక మార్గాన ప్రముఖ సినీహీరో నాని నడుచుకుంటూ తిరుమల చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కాగా ఆయన సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

రెండు బైక్‌ల ఢీ : ఒకరి మృతి


ఘటనాస్థలంలో మునిచంద్ర మృతదేహం

ఏర్పేడు : మండలంలోని మన్నసముద్రం వద్ద ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. శ్రీకాళహస్తి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మునిచంద్ర(32) బైక్‌పై ఏర్పేడుకు వెళుతుండగా మన్నసముద్రం క్రాస్ వద్ద గుర్తు తెలియని మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మునిచంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

వర్షానికి పశువులు మృతి


పెద్ద పాండూరులో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన గేదె, రాచర్లలో మృతి చెందిన ఆవు


వరదయ్యపాళెం: భారీ వర్షాలకు మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో 3 పశువులు మృతి చెందాయి. పెద్ద పాండూరు వద్ద విద్యుత్ తీగ తెగిపడి షాక్ తగలడంతో షేక్ మహబూబ్‌కు చెందిన రూ.70 వేలు గేదె మృతి చెందింది. అలాగే కరెంట్ షాక్‌తో చిన్న పాండూరుకు చెందిన భాస్కర్ గేదె చనిపోయింది. చలి తీవ్రతను తట్టుకోలేక రాచర్లకు చెందిన రెడ్డి ఏబీ జెర్సీ ఆవు మృతి చెందింది. దీని విలువ రూ.1.20 లక్షలని బాధితుడు తెలిపాడు. షార్ట్ సర్క్యూట్ కారణంగా పులివల్లంకు చెందిన పి.నాగేంద్ర ఇంట్లో వస్తువులు కాలిపోయాయి. ఈ ప్రమాదాల గురించి జిల్లా కలెక్టర్‌కు నివేదించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు


భోజనం వడ్డిస్తున్న ఆర్‌డీఓ కిరణ్‌కుమార్

చిల్లకూరు: తుపాను కారణంగా మండలంలోని ముంపు ప్రాంత ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదివారం గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బాధితులకు ఆహారం, తాగునీరు అందించారు. తిప్పగుంట పాళెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో తలదాచుకుంటున్న 50 మందికి భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటసూర్యసాయి, మండల ప్రత్యేక అధికారి చెన్నయ్య, వైఎస్సార్‌సీపీ నేత సనత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పులకింత


తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు శేషాచల ప్రకృతి సోయగం కనువిందు చేస్తోంది. రమణీయ దృశ్యాలతో యాత్రికులను కట్టిపడేస్తోంది. కొండపై నుంచి జాలువారుతున్న జలపాతాలతో ఆకట్టుకుంటోంది. హృదయాలను పరవశింజేసే చిత్రాలను 'సాక్షి' కెమెరా బంధించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

సుదర్శనరెడ్డికి మంత్రుల నివాళి


నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి

నారాయణవనం: వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సుదర్శన రెడ్డి కుమారుడు ఎంపీపీ దివాకర్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేతలు డీఎస్ ఏలుమలై, బీరేంద్రవర్మ, రవిరాజు, ఏకాంబరం, అన్నాదొరై, కోనేటి బాబు, ఏవీఎం బాలాజీరెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, అపరంజిరాజు, బుజ్జిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, పార్తీబన్ (ఫైల్)

పిచ్చాటూరు : మండలకేంద్రంలో కూరగాయల దుకాణం నిర్వహించే పార్తీబన్(40) అనే వ్యక్తి శనివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు.. పార్తీబన్, శాంతి దంపతులు కూరగాయలు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి దుకాణం మూసేందుకు షట్టర్ లాగుతుండగా విద్యుత్ తీగ తగలడంతో కరెంట్ షాక్‌కు గురై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. పార్తీబన్‌ను అతడి కుమారుడు యువరాజ్ వెంటనే స్థానికుల సాయంతో పుత్తూరులోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం మధ్యాహ్నం మృతుడి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మండల అధ్యక్షుడు కేవీ చలపతిరాజు, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు, స్థానిక నేతలు మోహన్ రెడ్డి, తొప్పయ్య, మోహన్ పాల్గొన్నారు.

ఆక్వా రైతులు అప్రమత్తం

- 850 మంది ఆక్వా రైతులకు అవగాహన
- 26 ల్యాండింగ్ సెంటర్లు పరిశీలన
- మూడు రోజులు 1030 బోట్లు నిలుపుదల చేయాలి


మత్స్యకారులకు సూచనలు చేస్తున్న మత్స్యశాఖ డీడీ నాగరాజు

తిరుపతి అర్బన్: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, మత్స్యశాఖ జిల్లా అధికారి నాగరాజు తెలిపారు. వారు శని, ఆదివారాల్లో చిల్లకూరు మండలంలోని గుమ్మలదిబ్బ, మోవిణి, ఓరవడి, కోట మండలంలోని గోవిందపల్లె, పట్టుపాళెం, కొత్తపట్నం, వాకాడు మండలంలోని దుగ్గిరాజుపట్నం, వాడపాళెం, వైట్ కుప్పం గ్రామాల్లో పర్యటించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లాలోని 75 కిలోమీటర్ల సముద్రతీరాన్ని ఆధారంగా చేసుకుని కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లో 850 మంది ఆక్వా రైతులు, మరో 4250 మంది మత్స్యకారులు 26 ల్యాండింగ్ సెంటర్లను ఆధారంగా చేసుకుని సముద్రంలో వేటకు వెళ్లి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఏ ఒక్కరూ మూడు రోజుల పాటు సముద్రం వైపు వెళ్లరాదని హెచ్చరించారు. ప్రధానంగా ఆక్వా రైతులు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

- చేపలు, రొయ్యలు పట్టరాదు.
- మేతలు బాగా తగ్గించాలి.
- ఎరువులు, రసాయన మందులను చెరువుల్లో చల్లరాదు.
- డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలి.
- కొత్తగా రొయ్యలు, చేప పిల్లలను వదలొద్దు.
- బలహీనంగా ఉన్న చెరువు గట్లను ఇసుక బస్తాలతో పటిష్టం చేయాలి.
- చెరువు గట్లు మీద కాపలా ఉండే వృద్ధులు, మహిళలు, పిల్లలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.
- మబ్బులు, వర్షం కారణంగా ఆక్సిజన్ స్థాయి తగ్గే అవకాశం ఉందని, పొటాషియం పర్మాంగనేట్ లేదా క్యాల్షియం ఫెరాక్సైడ్ లేదా ఆక్సిజన్ బిళ్లలు ఉంచుకోవాలి.
- పీతలు, గట్లు ఎత్తు తక్కువ ఉన్న రొయ్యల చెరువులకు ఒక మీటర్ ఎత్తులో చెరువు చుట్టూ వలను ఏర్పాటు చేసుకోవాలి.
- అధిక వర్షపాతం కారణంగా ఉదజని సూచిక తగ్గే అవకాశం ఉన్నందున వర్షం తగ్గిన వెంటనే ఎకరాకు 50 నుంచి 100 కేజీల వ్యవసాయ సున్నం వాడుకోవాలి.
- తల్లి చేపలు చనిపోయే అవకాశం వున్నందున పట్టుబడి చేయుటకు ఐస్ సిద్ధంగా పెట్టుకోవాలి.
- చనిపోయిన చేపలను వెంటనే గోతులో సున్నం వేసి కప్పెటాలి.
- రొయ్యల చెరువులో వర్షం తగ్గిన వెంటనే వర్షపు నీటిని బయటకు పంపించాలి.
- చెరువు గట్ల మీద విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా వుండాలి.